సాక్షి
వికారాబాద్
శనివారం : 30 : ఆగస్టు : 2025



రాగిజావ లేనట్టేనా!

సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. 8లో▸



మెనూ ప్రకారం భోజనం..

కొడంగల్ పట్టణంలోని కేజీబీవీని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. 8లో▸



కమీషన్ వచ్చేనా!

రేషన్ డీలర్లకు కమీషన్ అందక అవస్థలు పడుతున్నారు. ఐదు నెలలుగా నిధులు విడుదల కాలేదని వారు తెలిపారు. 9లో▸

రోడ్లకు మోక్షం

రూ.946 కోట్లతో విస్తరణ, అభివృద్ధి పనులు



వికారాబాద్ - పరిగి రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన చెట్లు

- త్వరలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు
- ఇప్పటికే చెట్ల తొలగింపు ప్రక్రియ పూర్తి

వికారాబాద్: జిల్లాలో దెబ్బతిన్న రోడ్లకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఐదు నెలల క్రితమే అంచనా వ్యయం ప్రకటించింది. రెండు నెలల క్రితం అగ్రిమెంట్లు, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. జిల్లాలోని పలు రహదారులను నాలుగు లేన్లగా విస్తరించనున్నారు. మిగతా వాటిని బలోపేతం చేసేందుకు సిద్ధమయ్యారు. అంతర్గత రోడ్లను పక్క జిల్లా రహదారులతో అనుసంధానం చేయనున్నారు. ఇందుకోసం రూ.946 కోట్లు మంజూరయ్యాయి. పరిగి-వికారాబాద్, పరిగి-షాద్‌నగర్ మార్గాలను నాలుగు లేన్లగా అభివృద్ధి చేస్తారు. ప్రస్తుతం ఈ రెండు రోడ్లకు ఇరువైపులా చెట్ల నరికివేత పనులు ప్రారంభమయ్యాయి. తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లోన్ని అనేక రహదారులను అభివృద్ధి చేస్తారు. రెండేళ్ల వ్యవధిలో పనులు పూర్తి చేయాలని నిబంధన విధించారు.

చేపట్టనున్న రోడ్లు ఇవే..

పరిగి - షాద్‌నగర్ రహదారిని బెంగళూరు - ముంబై హైవే లింక్ రోడ్డుగా వినియోగిస్తున్నారు. ఐదేళ్లుగా ఈ మార్గంలో రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం దీన్ని నాలుగు లేన్లగా విస్తరించనున్నారు. పరిగి నుంచి వికారాబాద్ వరకు ఉన్న రెండు వరుసల రోడ్డును ఫోర్‌లేన్‌గా అభివృద్ధి చేస్తారు. పై రెండు రోడ్లు కలిపి రూ.240 కోట్లు మంజూరయ్యాయి. రూ.7 కోట్లతో వంతెన నిర్మించనున్నారు. పరిగి నియోజకవర్గం గడిసింగాపూర్ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలం రంగారెడ్డిపల్లి వరకు రెండు వరుసల రహదారిని నిర్మిస్తారు. వికారాబాద్ - గోధుంగూడ రోడ్డును డబుల్‌గా విస్తరించాలని నిర్ణయించారు. ఈ రెండు రోడ్లకు రూ.210 కోట్లతో టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. కొడంగల్ పట్టణంతో పాటు అగ్గనూరు నుంచి బషీరాబాద్ మీదుగా మైల్వార్ వరకు రోడ్డు మంజూరైంది. ఈ రోడ్లకు రూ.151 కోట్లు విడుదల చేశారు. కొడంగల్ పట్టణంలో నాలుగు లేన్లు, మిగతా వాటిని రెండు లేన్లుగా అభివృద్ధి చేస్తారు. తుంకిమెట్ల నుంచి నారాయణపేట వరకు.. కోటకొండ నుంచి మద్దూరు వరకు రోడ్లను విస్తరించడంతో పాటు రెండు బ్రిడ్జిల నిర్మాణానికి రూ.295 కోట్లు ఖర్చు చేయనున్నారు. మరో రూ.50 కోట్లతో వికారాబాద్ - తాండూరు రోడ్డును బలోపేతం చేస్తారు. వీటితో పాటు జిల్లాలోని పలు అంతర్గత రోడ్ల అభివృద్ధికి దాదాపు రూ.300 కోట్ల వరకు మంజూరు చేశారు. ఇందులో కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

- పరిగి - షాద్‌నగర్, పరిగి - వికారాబాద్ రోడ్లకు రూ.240 కోట్లు
- గడిసింగాపూర్ - రంగారెడ్డిపల్లి, గోధుంగూడ రోడ్లకు రూ.210 కోట్లు
- కొడంగల్ టౌన్, అగ్గనూరు - మైల్వార్ రహదారికి రూ.151 కోట్లు
- తుంకిమెట్ల - నారాయణపేట్ రోడ్డుకు రూ.295 కోట్లు
- వికారాబాద్ - తాండూరు మార్గానికి రూ.50 కోట్లు

సీఎం జిల్లా కావడంతో..

జిల్లాలోని ప్రధాన రహదారులన్నీ దెబ్బతిన్నాయి. దశాబ్ద కాలంగా తాత్కాలిక మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కసారిగా రూ.946 కోట్లు మంజూరు కావడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటంతో కలిసొచ్చింది. ఎమ్మెల్యేలు సమస్యలను సీఎం దృష్టికి తెచ్చి తక్షణ అనుమతులు తెచ్చుకుంటున్నారు.

త్వరలో మరిన్ని నిధులు



బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రోడ్ల గురించి పట్టించుకోలేదు. ప్రజా ప్రభుత్వం వచ్చాక జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తాం. త్వరలో మరిన్ని నిధులు మంజూరు చేయిస్తాం. త్రిపుల్‌ఆర్ జిల్లా మీదుగా వెళ్లేందుకు సీఎంను ఒప్పించాం.

– టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

న్యూస్‌రీల్

6వ తేదీ సాయంత్రం లోపు నిమజ్జనం చేయాలి



జయతీర్థాచారి

కొడంగల్: వినాయక ప్రతిమలను సెప్టెంబర్ 6వ తేదీ సాయంత్రం లోపు నిమజ్జనం చేయాలని ధీప ధూప నైవేద్యం (డీడీఎస్) జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. 7వ తేదీ చంద్ర గ్రహణం ఉందన్నారు. ఆ ఘడియల్లో నిమజ్జనం చేయడం మంచిది కాదన్నారు. ముద్గల పురాణం ప్రకారం గణపతి పూజా విధానం నిర్దేశించబడిందన్నారు. చవితి నుంచి ప్రారంభించి అనంత చతుర్దశి వరకు గణపతులను పూజించి నిమజ్జనం చేయవచ్చన్నారు. ఒకటి, మూడు, ఐదు, ఏడు, తొమ్మిది, పదకొండు రాత్రులు స్వామివారిని పూజించిన తర్వాతనే నిమజ్జనానికి తరలించాలన్నారు. ఇళ్లలో, మంటపాల్లో ప్రతిష్ఠించిన గణాధిపతులను ఈ నెల 30న, వచ్చే నెల 1, 3, 5, 6వ తేదీల్లో గంగమ్మ ఒడికి చేర్చాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే తండాల అభివృద్ధి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి



గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

దుద్యాల్: తండాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం అని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చెట్టుపల్లి తండాలో రూ.30 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, తండాల్లోని అన్ని కాలనీలకు సీసీ రోడ్లు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, పంచాయతీ రాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, పార్టీ గ్రామ అధ్యక్షుడు రమేశ్ చౌహాన్ తదితరలు పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

బంట్వారం: తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు బంట్వారం ప్రిన్సిపాల్ బ్యూలా తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వరకు మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సర్టిఫికెట్లతో మోడల్ స్కూల్‌లో తమను సంప్రదించాలని ఆమె సూచించారు.

పాంబండ హుండీ ఆదాయం రూ.2,67,710



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

కుల్కచర్ల: పాంబండ ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, ఈఓ బాలనర్సయ్య తెలిపారు. శుక్రవారం ఆలయంలో శ్రావణమాస ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని హుండీ ఆదా యాన్ని లెక్కించారు. భక్తులు రూ.2,67,710 సమర్పించారని తెలిపారు. కార్యక్రమంలో ఆల య పూజారి పాండు శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి

అనంతగిరి: వికారాబాద్ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వైష్ణవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి, అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తి శాంతిలతా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులు

ఘనంగా క్రీడా దినోత్సవం

- కలెక్టరేట్ ఉద్యోగులకు ఆటల పోటీలు
- ప్రారంభించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ఉత్సాహంగా పాల్గొన్న సిబ్బంది



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ క్రీడలను ప్రారంభించారు. ముందుగా ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగులతో కలిసి తాడుతో టగ్గాఫర్ క్రీడల్లో కలెక్టర్ పాల్గొని ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపారు. 100 మీటర్ల రన్నింగ్, క్యారమ్స్ చెస్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్ పోటీల్లో ఉద్యోగులు చురుగ్గా పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, ఎం.సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీవైఎస్‌ఓ సత్తార్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీటీడబ్ల్యూఓ కమలాకర్ రెడ్డి, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, వ్యవసాయ అధికారి రాజరత్నం, ఆకార అధికారి నాగార్జున, ఆడిట్ అధికారి శ్రీనివాస్ బాబు, డీబీసీడబ్ల్యూఓ మాధవ రెడ్డి, హౌసింగ్ శాఖ ఇన్‌చార్జ్ పీడీ మొక్రం బాబా, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నైమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు రైతు సమస్యలు పట్టవా?



దున్నపోతుతో ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్, బీఆర్‌ఎస్ నాయకులు

- బస్తా యూరియా కోసం పడిగాపులు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- తాండూరు – హైదరాబాద్ ప్రధాన రహదారిపై నిరసన

ధారూరు: అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు రైతులు పడుతున్న ఇబ్బందులు పట్టవా అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రశ్నించారు. శుక్రవారం ధారూరు పట్టణ పరిధిలోని తాండూరు – హైదరాబాద్ ప్రధాన రహదారిపై యూరియా కొరతపై వినూత్న నిరసన తెలిపారు. దున్నపోతుతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు క్యూ కడుతున్నారని తెలిపారు. ధారూరు, వికారాబాద్, మోమిన్‌పేట్, మర్పల్లి, బంటారం గ్రామాల్లో గంటల తరబడి వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇతర ప్రాంతాల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. పది ఎకరాలు ఉన్న రైతుకు ఒక్క సంచే ఇస్తున్నారని తెలిపారు. రైతులు, ప్రజల సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. స్పీకర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల గోడు వినాలని సూచించారు. యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తున్న వారిని జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ఎ.అంజయ్య, హఫీజ్, రాములు, వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మయ్య, బాల్‌రాజ్ నాయక్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సహకరించాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: స్థానిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 వరకు గ్రామ పంచాయతీల్లో అర్జీలు స్వీకరిస్తామన్నారు. జిల్లాలో 2025, జూలై 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితాను సరించి గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా జాబితా సిద్ధం చేయడం జరిగిందన్నారు. 31న ఆయా అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారులు పరిష్కరిస్తారన్నారు. సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 594 గ్రామ పంచాయతీల్లో 5,058 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. 6,98,478 ఓటర్లు ఉన్నారని, ఇందులో 3,43,672 మంది పురుషులు, 3,54,790 మంది మహిళలు, 16 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డీపీఓ జయసుధ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కోకట్ కాగ్నా నది వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి తదితరులు

నిమజ్జనానికి పకడ్బందీ చర్యలు

- ఎస్పీ నారాయణరెడ్డి

యాలాల: మండలంలోని కోకట్ కాగ్నా నది వద్ద నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ వెంకటస్వామి, రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ విఠల్‌తో కలిసి నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా చూస్తామన్నారు. తాండూరు పట్టణంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను ఐదో రోజు నిమజ్జనం చేస్తారని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. రెవెన్యూ, మున్సిపల్, ట్రా న్స్‌కో, హిందూ ఉత్సవ సమితి సభ్యుల సహకారం తీసుకుంటామని పేర్కొన్నారు. విగ్రహాలు తరలించే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. కాగ్నా బ్రిడ్జి వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా వంతెనకు ఇరువైపులా బారికేడ్లు, వలంటీర్లను ఏర్పాటు చేస్తామన్నారు. 300 మంది పోలీసు సిబ్బంది, నలుగురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు, ప్రత్యేక బృందాలతో శాంతిభద్రతల విషయంలో బందోబస్తులో ఉంటారని తెలిపారు.

స్వాతి కుటుంబానికి అండగా నిలుస్తాం

- బీసీలను అణగదొక్కాలని చూస్తే ఊరుకోం
- అవసరమైతే ఢిల్లీ వరకు పోరాడుతాం
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

అనంతగిరి: ఇటీవల భర్త చేతిలో దారుణ హత్యకు గురైన స్వాతి తల్లిదండ్రులను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పరామర్శించారు. శుక్రవారం వికారాబాద్ మండలం కామారెడ్డిగూడకు చేరుకున్న ఆయన ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ అధికారులకు ఫోన్ చేసి కేసు పురోగతిపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. స్వాతిని అతి పైశాచికంగా హత్య చేయడం దారుణమన్నారు. ఈ ఘటన జరగకముందే మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు గ్రామం విడిచి వెళ్లిపోయారని బాధితులు చెప్పారన్నారు. దీన్నిబట్టి పథకం ప్రకారమే హత్య జరిగిందన్నారు. ఈ కేసులో మహేందర్‌రెడ్డి ఒక్కడినే జైలుకు పంపి, మిగిలిన వారిని వదిలేశారని ఆరోపించారు. హత్యకు కారణమైనవారందరినీ అరెస్టు చేయాలన్నారు. మేడిపల్లి సీఐ ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. వెంటనే మహేందర్ రెడ్డి కుటుంబీకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇంతటి దారుణ ఘటన జరిగినా సీఎం రేవంత్‌రెడ్డి కనీసం ఓ మంత్రిని కూడా పంపించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఓ బీసీ ఆడ బిడ్డకు ఇంతటి అన్యాయం జరిగినా స్పందించకపోవడం దారుణమన్నారు. యావత్ బీసీ సమాజం స్వాతి కుటుంబానికి అండగా నిలుస్తుందని, అవసరమైతే ఢిల్లీ వరకూ పోరాడుతామని స్పష్టంచేశారు. బీసీలను అణగదొక్కుతామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఆయన వెంట బీసీ పొలిటికల్ జేఏసీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ హరిశంకర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు వట్టి జానయ్య యాదవ్, ఓదేలు యాదవ్, నాగరాజుగౌడ్, నరేష్ పటేల్, వెంకటేశ్, విజయ్, సుదర్శన్‌గౌడ్, చంద్రశేఖర్, రవీందర్, ప్రవీణ్, రంగయ్య తదితరులు ఉన్నారు.



స్వాతి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హిందూ ఉత్సవ సమితికి ఎమ్మెల్సీ విరాళం

తాండూరు టౌన్: తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితికి మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు ఆయన కుమారుడు రినీష్ రెడ్డి శుక్రవారం సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలుకు తాండూరులోని ఆయన నివాసంలో రూ.3,01,116ల నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా రినీష్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయ పండుగలను, సంస్కృతి, సంప్రదాయాలను ఉత్సవాల రూపంలో నిర్వహిస్తున్న హిందూ ఉత్సవ కేంద్ర సమితికి భవిష్యత్‌లో సైతం తమ వంతు సాయం అందిస్తామన్నారు. అనంతరం ఆయన పట్టణంలోని పలు వినాయక మంటపాల్లో వెలిసిన గణేశ్‌లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరిమళ, బిర్కట్ రఘు, సమితి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న రినీష్ రెడ్డి

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- శాస్త్రవేత్తలు రాజేశ్వర్‌రెడ్డి, మధు శేఖర్



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: అధిక వర్షాల నేపథ్యంలో ప్రధాన పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాజేశ్వర్‌రెడ్డి, మధు శేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని రుద్రారం రైతు వేదికలో కంది, పత్తి తదితర పంటల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. అధిక వర్షాల కారణంగా పత్తి మొక్కలు పోషకాలను తీసుకోకపోవడంతో ఆకులు ఎర్రబడి రాలిపోతాయని, ఈ తెగులు కనిపించిన వెంటనే నీటిలో కరిగే పోషకాలు 19 – 19 – 19 లేదా నత్రజని, బాస్వరం, పొటాషియంను 10 గ్రాముల చొప్పున లేదా యూరియా 20 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుతం పత్తి పంటలో రసం పీల్చే పురుగు, పేను బంక, పచ్చ దోమ, తమర పురుగు ఆశిస్తున్నాయని, కాండానికి మందు పూత పూసే పద్ధతి ద్వారా మోనోక్రోటోఫాస్ 1:4 నిష్పత్తిలో 30 రోజుల దశలో, ఇమిడాక్లోప్రిడ్ 1:20 నిష్పత్తిలో 45 నుంచి 60రోజుల దశలో పిచికారీ చేయాలన్నారు. వేరుకుళ్లు తెగులు సోకడంతో కాండం అడుగు భాగంలో నల్లగా మారుతుందని, నివారణకు కార్బండిజమ్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి మొక్క మొదట్లో పిచికారీ చేయాలని, వారంలో రెండు పర్యాయాలు చేయాలని తెలిపారు. పత్తిని ఆశించే గులాబీ రంగు పురుగు నివారణకు పంట పూత దశ నుంచే లింగాకర్షక బుట్టల ద్వారా తొలి పూత దశ నుంచే పొలంలో కనిపించే గడ్డి పూలను నిర్మూలించాలని సూచించారు. పురుగు ఉధృతిని దృష్టిలో పెట్టుకొని క్వినాల్‌ఫాస్ 2 ఎంఎల్, ప్రొఫెనోఫాస్ 2 ఎంఎల్, థయోడికార్బ్ 1.5 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి మందులను మారుస్తూ అవసరం మేరకు పిచికారీ చేయాలని సూచించారు.

కంది పంటలో..

కంది పొలంలో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 3 గ్రాముల కాపరాక్సీ క్లోరైడ్ లీటరు నీటితో కలిపి కాండం, మొక్క మొదలులో పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎండు తెగులు సోకే ప్రమాదం ఉందని తెగులు సోకిన పంటకు లీటరు నీటిలో మెటలక్సిల్ 25 శాతం డబ్ల్యూఎస్‌పీ మందును పిచికారీ పంపు నాజిల్ తీసి మొక్క మొదలు తడిచే విధంగా సాలు మొత్తం తడపాలన్నారు. తాత్కాలిక పోషణ లపం సవరణకు నీటిలో కరిగే పోషకాలైన 13:0 45 లేదీ 19:19:19ను 5గ్రాముల ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వర్షం తగ్గాక గొర్రు లేదా గుంటుకతో అంతర కృషి చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.తులసి, ఏఈఓలు శ్రీపతిరెడ్డి, ఐస్సాక్ హెరాల్డ్, రాజు రాథోడ్, దేవేందర్, సుమ, పావని, అశ్విని, గ్రామస్తులు ఆనంద్‌రెడ్డి, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి అల్లరాయప్ప జాతర


మూలవిరాట్

దౌల్తాబాద్: మండలంలోని ఇండాపూర్ గ్రామ శివారులో ఉన్న అల్లరాయప్ప జాతర శనివారం నుంచి నిర్వహించనున్నట్లు మాజీసర్పంచ్ సంతోష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సిములు తెలిపారు. ఉదయం గ్రామంలో హనుమాన్ దేవాలయం నుంచి పల్లకీసేవ, స్వామివారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని పేర్కొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు


నూతన బోరు మోటార్‌ను అమర్చుతున్న సిబ్బంది

దోమ: గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నూతన మోటార్‌ను అమర్చి తాగునీటి ఇబ్బందులు తొలగించారు. ఇటీవల బోరు మోటారు మరమ్మతులకు గురవ్వడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా నిమజ్జనం చేసుకోవాలి

కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి


దౌల్తాబాద్‌లో గణేశ్ మండపం వద్ద సూచనలు చేస్తున్న సీఐ

దౌల్తాబాద్: గణేశ్ మండపాల నిర్వాహకులు నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో గణేశ్ మండపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనం రోజు జాగ్రత్తలు పాటించాలని ఎలాంటి గొడవలు చేసుకోకుండా చూడాలన్నారు. అలాగే కరెంట్ తీగల వద్ద, నిమజ్జనం చేసేటప్పుడు చెరువుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంబడి ఎస్‌ఐ రాజ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


శేఖర్(ఫైల్)

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన పట్టణంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్ కూడలి వద్ద గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళపల్లి గ్రామానికి చెందిన దరువుల శేఖర్(20) రాత్రి 12 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై మంగళపల్లి వెళ్తుండగా.. చౌరస్తా వద్ద యువకున్ని ఇన్నోవాకారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్ ఎగిరి కింద అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి తండ్రి చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రాగిజావ లేనట్టేనా!


దౌల్తాబాద్‌లో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న నిర్వాహకులు (ఫైల్)

గతేడాది వరకు సాగిన పంపిణీ

- ప్రస్తుతం ఊసే లేదంటున్న విద్యార్థులు
- పోషకాహారానికి దూరమవుతున్న చిన్నారులు


రాగిజావ

దౌల్తాబాద్: ప్రభుత్వం విద్యార్థుల హాజరు శాతం పెంపునకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నా ఉద్దేశంతో బడుల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తోంది. అలాగే పీఎం పోషన్ అభియాన్ కింద 2023–24లో ఉదయం వేళ రాగిజావ అందించే ఏర్పాట్లు చేశారు. పలు రకాల పోషకాలుండడంతో పిల్లలకు ఆరోగ్యపరంగా ఎంతో మేలు జరిగింది. గత ఏడాది పాఠశాలలు ముగిసే వరకు సజావుగానే విద్యార్థులకు అందజేశారు. ఈ విద్యా సంవత్సరం జూన్ 12 ప్రారంభమైంది. ఇప్పటివరకు పంపిణీ జాడ లేక అర్ధాకలితో చదువుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

ఇబ్బందుల మధ్య..

మండలంలో 40 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని 3,472 మంది పిల్లలకు అందజేస్తున్నారు. రోజు వారీగా మెనూ అమలు చేస్తూ భోజనాన్ని నిర్వాహకులు వండి పెడుతున్నారు. మూడు రోజుల పాటు కోడి గుడ్డును ఇస్తున్నారు. ఉదయం వేళ మరో మూడు రోజులు రాగి జావ అందించాలని నిర్ణయించి గత విద్యా సంవత్సరం వరకు ఇచ్చారు. బడులు తెరుచుకుని రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకుదాని ఊసేలేదు.

స్పందిస్తేనే ప్రయోజనం

ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల చొప్పున రాగి పిండి, బెల్లం కేటాయించేవారు. దానిని వేడి నీళ్లలో కలిపి 150–200 మిల్లీ లీటర్ల చొప్పున ఒక్కో విద్యార్థికి అందించేవారు. అందులో ఉండే పోషకాలతో పిల్లల ఎదుగుదలతో పాటు ఆరోగ్య పరంగా ఎంతో మేలు చేస్తుంది. రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందిస్తేనే విద్యార్థులకు ప్రయోజనం జరగనుందని పలువురు కోరుతున్నారు.

> **ఉన్నతాధికారులకు నివేదించాం**
> రాగిజావ పంపిణీకి సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. పంపిణీ కాగానే వెంటనే పాఠశాలలకు సరఫరా చేసి అందించేలా ఇప్పటికే కార్యాచరణ రూపొందించాం.
> – వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

‘నానో’పై అవగాహన పెంచండి


రైతులతో సమావేశమైన అధికారులు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాజరత్నం

కుల్కచర్ల: నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాజరత్నం సూచించారు. శుక్రవారం కుల్కచర్ల శివారులో పలువురు రైతులకు నానో యూరియా వాడకంపై సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నానో వాడకం వల్ల నత్రజని వృథా కాకుండా అరికట్టవచ్చని తెలిపారు. లీటరు నీటికి 2 నుంచి 4 మిల్లీ లీటర్ల నానో యూరియా కలిపి పిచికారీ చేసుకోవచ్చన్నారు. 500 మిల్లీ లీటర్ల నానో యూరియా రూ.225 మాత్రమే అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మండల వ్యవసాయాధికారి వీరస్వామి, వ్యవసాయ సంచాలకులు లక్ష్మీకుమారి, ఏఈఓలు బాబు, నిఖిత, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంది

పరిగి: జిల్లాలో సాగుకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందరాదని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాజరత్నం అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. నానో యూరియా వాడితే అధిక దిగుబడి వస్తుందన్నారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఏడీఏ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ


అనంతగిరి: వికారాబాద్‌లోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో ఉన్న యూరియా స్టాక్‌ను పరిశీలించడంతో పాటు పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఓ ప్రసన్నలక్ష్మి ఉన్నారు.

అధిక దిగుబడి

అనంతగిరి: నానో యూరియా వినియోగించడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నానో యూరియాను నేరుగా మొక్కలు, ఆకులపై పిచికారీ చేయవచ్చన్నారు. జిల్లాలో 5,431 లీటర్లు అందుబాటులో ఉందని తెలిపారు.

స్వచ్ఛతపై పాఠశాలలకు రేటింగ్

ఎంఈఓ చంద్రప్ప


మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ–హరిత విద్యాలయ పేరుతో రేటింగ్ నిర్వహిస్తుందని కోట్‌పల్లి ఎంఈఓ చంద్రప్ప అన్నారు. శుక్రవారం మానవ వనరుల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 విభాగాల్లో ఫైవ్ స్టార్ సిస్టంతో స్కూళ్లకు రేటింగ్ ఇస్తున్నారని చెప్పారు. రేటింగ్ ఆధారంగా గెలుపొందిన స్కూళ్లకు బహుమతులతో పాటు నిధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ అరుణ్‌కుమార్, సీఆర్‌పీ నర్సింలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సహకారంతో టాయిలెట్స్ నిర్మాణం


టాయిలెట్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

శంకుస్థాపన చేసిన బీఆర్‌ఎస్ నాయకులు

కేశంపేట: ఇటీవల మండల పర్యటనలో భాగంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి మండల పరిధిలోని నిర్దవెల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు టాయిలెట్స్ లేక ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన టాయిలెట్స్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ మేరకు తన సొంత ఖర్చుతో టాయిలెట్స్ నిర్మాణానికి ముందుకు వచ్చారు. శుక్రవారం పాఠశాలలో బీఆర్‌ఎస్ నాయకులు శంకుస్థాపన కార్యక్రమంను నిర్వహించారు. దీంతో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సురేందర్, మాజీ సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, వెంకటయ్య, జంగయ్య, బాలరాజ్‌గౌడ్, యాదయ్య, కృష్ణయ్య, వెంకట్, జగన్‌రెడ్డి, యాదయ్యగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌పై కేసు నమోదు

అనుమతి లేకుండా రోడ్డుపై ధర్నా చేశారని పోలీసుల వెల్లడి

ధారూరు: అనుమతి లేకుండా మండల కేంద్రంలోని తాండూరు–హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై ధర్నా చేసిన 20 మంది బీఆర్‌ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు సర్కిల్ సీఐ రఘురామ్ శుక్రవారం తెలిపారు. యూరియా కొరతకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు రోడ్డుపై ధర్నా చేసి రాకపోకలకు అసౌకర్యం కల్పించినందుకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆందోళనతో వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఈ ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ విజయ్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, చిన్నయ్యగౌడ్, అంజయ్య, రాములు, జైపాల్‌రెడ్డి, లక్ష్మయ్య, రహమతుల్లాఖాన్, జహంగీర్, ఎండీ చాన్ తదితరులపై కేసు నమోదు చేశామని వివరించారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

తాండూరు ఏడీఏ కొమురయ్య

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తోందని, ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని తాండూరు వ్యవసాయశాఖ ఏడీఏ కొమురయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళ, చిన్న, సన్నకారు అన్నదాతలు, ఐదు ఎకరాల లోపు భూమి ఉన్నవారికి 50 శాతం, ఇతర రైతులకు 40 శాతంతో పరికరాలు అందిస్తారన్నారు. సబ్–మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్(స్మామ్) పథకం కింద స్ప్రేయర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు ఉన్నాయన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, దరఖాస్తు ఫారం, ట్రాక్టర్ పరికరాలు తీసుకోవాల్సిన రైతులు ఆర్‌సీ బుక్‌లతో పాటు డీడీ అందజేయాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు లబ్ధి పొందని మహిళ రైతులకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తామన్నారు.

వాగులో దూకిన వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని తీసుకొస్తున్న బోటింగ్ గార్డ్స్

బంట్వారం: వాగులో దూకిన వ్యక్తి శవం శుక్రవారం లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన చాకలి సంగమేశ్వర్(38) ఇంట్లో గొడవపడి మనస్తాపంతో రెండు రోజుల కిందట ఉధృతంగా ప్రవహిస్తున్న కోట్‌పల్లి వాగులో దూకిన సంగతి తెలిసిందే. ఆయన భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ధారూరు సీఐ రఘురాములు, ఎస్‌ఐ శైలజ పర్యవేక్షణలో కోట్‌పల్లి ప్రాజెక్టు బోటింగ్ గార్డ్స్ గాలింపు చర్యలు చేపట్టి శుక్రవారం మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ మేరకు మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం జరిపించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

మంచాల: మూగ జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల గొర్ల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని పశు వైద్యాధికారి సుధారెడ్డి చెప్పారు. శుక్రవారం మండల పరిధి నోముల గ్రామంలో జీవాలకు పుర్రు రోగం టీకా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో వచ్చే వాతావరణ మార్పుల వలన జీవాలు రోగాల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. ముందు జాగ్రత్తగా వాటికి టీకా వేయించాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం ఉండాలి

కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి


కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో ఉన్న మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. మెస్‌లో కూరగాయలు, నిత్యావసర సరుకులను గమనించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడం వల్ల విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. పాఠశాలలో శుభ్రతను పాటించాలని నిర్వాహకులకు సూచించారు. తరగతి గదులు, వంట గది, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతి రోజు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. కస్తూర్బాగాంధీ ప్రత్యేకాధికారి, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవనం ప్రారంభమెప్పుడో!


ఖాంజపూర్‌లో పిచ్చి మొక్కల మధ్య పంచాయతీ కార్యాలయం

తాండూరు రూరల్: నిర్మాణం పూర్తయిన గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభానికి నోచుకోవడం లేదు. మండల పరిధిలోని ఖాంజాపూర్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.20 లక్షలతో నూతనంగా గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్మించారు. పూర్తయి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు భవనం ప్రారంభించలేదు. దీంతో భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. రూ.లక్షలు ఖర్చు పెట్టి భవనం నిర్మించి.. వాడుకలోకి తీసుకురాకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. భవనం వద్దకు వెళ్లాలంటే సరైన రోడ్డు మార్గం కూడా లేదన్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు స్పందించి వెంటనే జీపీ భవనం ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.


మోమిన్‌పేటలో అలుగు పారుతున్న నందివాగు ప్రాజెక్టు

జోరువర్షం.. జలం పుష్కలం

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులు మత్తడి దుంకుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు నిండు కుండలా మరాయి. ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో మత్తడి దుంకుతున్నాయి. శుక్రవారం మండల పరిధిలోని నందివాగు, అయిమ చెరువులు అలుగు పారుతున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– మోమిన్‌పేట


టేకులపల్లిలో మత్తడి దుంకుతున్న అయిమ చెరువు

మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళిక

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


షాద్‌నగర్: పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయిబాలాజీ టౌన్‌షిప్‌లో అమృత్ పథకంలో భాగంగా రూ.76లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు తిరుపతిరెడ్డి, రఘు నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, శివశంకర్, ప్రవీణ్, ఖదీర్, ముబారక్, అప్పి, జయప్రకాశ్, కరుణాకర్, రవిజేత, దిలీప్, శ్రీధర్, మాధవులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

నందిగామ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయం ముఖద్వారం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. ముఖద్వార నిర్మాణం, కమ్యూనిటి హాల్ నిర్మాణానికి రూ.15 లక్షల చెక్కు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, చించేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో మేలు


లబ్ధిదారులతో ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రభుత్వ పథకాలతో పేదలకు మేలు చేకూరుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్ మండల వాసులకు మంజూరైన 66 సీఎంఆర్‌ఎఫ్. 11 కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, ఆగిరెడ్డి, వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, షాబాద్ దర్శన్, మానెయ్య, రాములు, నర్సింలు, మల్లేశ్, సుదర్శన్, గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి బలవన్మరణం

పురుగు మందుతాగి.. చికిత్స పొందుతూ మృతి


మోహన్ మృతదేహం

నందిగామ: పురుగు మందు తాగి ఓ కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధి ఆర్‌ఎం స్టీల్ పరిశ్రమలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం జీడీగడ్డ తండాకు వాసి పాత్లావత్ మోహన్(32) ఏడేళ్లుగా నందిగామ మండలంలోని పరిశ్రమలో క్వాలిటీ మేనేజర్‌గా పనిచేసేవాడు. గురువారం యథావిధిగా విధులకు వచ్చిన మోహన్.. 11.30 గంటల సమయంలో పరిశ్రమలోనే పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడున్నాడు. ఇది గమనించిన తోటి కార్మికులు చికిత్స నిమిత్తం శంషాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉస్మానియాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. గతంలో జరిగిన ప్రమాదం వలన అయిన గాయాల బాధ భరించలేకే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా.. మోహన్ ఆత్మహత్యకు నిరసనగా తొలుత కుటుంబీకులు పరిశ్రమ ఎదుట ఆందోళన వ్యక్తంచేశారు. కంపెనీలో ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. దీంతో ఎస్‌ఐ దేవరాజ్ ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడారు. యాజమాన్యంతో మాట్లాడిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.